# మానవత్వం

సోనీ, తండ్రి పీటర్ రాసిన ఉత్తరం చదువుతున్నది. అది మొదటిసారి కాదు ఆమె చదవడం. కనీసం ఆరుసార్లన్నా చదివి ఉంటుంది. దానిలో ఓ వాక్యం గుండెల్ని పిండేస్తున్నది.

"లక్ష రూపాయలు పెండ్లి ఖర్చు ఇస్తే మోసెస్ చేసుకుంటానన్నాడు. ప్రభువు దయ వలన ఇది కుదిరిందని సంతోషించాలా - సాతాను దృష్టి వలన లక్ష కట్నం ఇవ్వలేక వదులుకుని బాధపడాలో అర్థమే కావడం లేదు. నేను ఎటూ తేల్చుకోలేక నీ పెళ్లి నీ ఇష్టానికే వదిలివేస్తున్నాను. నీవు బాగా యోచించి ఓ నిర్ణయం తీసుకుని రాయి."

లక్ష రూపాయలు - పెండ్లి ఖర్చు ... హుఁ! కట్నాని కిచ్చిన అందమైన మారుపేరు. ఏ పేరుతోనైతేనేం ఆడపిల్ల తల్లిదండ్రుల ఇల్లు, ఒళ్లు గుల్ల చెయ్యాలి.

ఏ మతంలో పుట్టినా ఈ దేశంలో పుట్టినందుకు ఈ కట్నం అనే అంటు వ్యాధికి గురికావలసిందే.

"డాక్టరమ్మగారు, డాక్టరమ్మగారూ! రాయుడిగారి బిడ్డకు సీరియస్‌గా ఉంది. వెంటనే రండి." ఆయా వచ్చి చెపుతున్నది.

ఆమె కంగారు చూస్తే రాయుడి బిడ్డకు ఏదో అయిందనిపించింది. నిన్ననే తను పరీక్ష చేసి మందు లిచ్చింది.

"నెప్పు లొస్తున్నాయా?"

"ఆఁ! బాగా ఆయాసపడుతున్నది. ఊపిరి ఆడ్డంలేదు."

"అక్టర్ లేడు?" సాధారణంగా ఏ కేసు వచ్చినా కాంపౌండరుంటే సమయోచితంగా మందులిస్తూ ఉంటాడు.

"ఉన్నాడు... మిమ్మల్ని వెంటనే తోలుకురమ్మన్నాడు."

"పద". తోలుకు రమ్మన్నాడు అన్నమాటకు నవ్వుకుంటూ బయలుదేరింది డాక్టర్ సోనీ.

సీతమ్మ పరిస్థితి చూస్తే కొంచెం భయం వేసింది. బిడ్డ అడ్డం తిరిగినట్టుంది. వెంటనే సిజేరియన్ చెయ్యాలి. రాయుడు ఆదుర్దాగా ఉన్నాడు.

"ఎలా ఉంది డాక్టరమ్మా?"

"పట్టణం తీసుకుపోతే బాగుంటుంది. కాని అంత వ్యవధి లేదు. నేను ఆపరేషన్ చేస్తాను, మీకెవరికీ అభ్యంతరం లేకపోతే" రాయుడిని, అతని కొడుకు ప్రతాప్‌ను చూస్తూ అంది.

"అభ్యంతరమా? మీరే కాపాడాలి నా భార్యను." ప్రతాప్ ఏడుపును ఆపుకుంటూ చెప్పాడు.

"ఇంత దాకా ఏం చేశారు?" కోపంగా అడిగింది.

"మంత్రసాని వల్ల అవుతుందేమోనని..."నీళ్లు నమిలాడు రాయుడు.

"ఛీ!ఛీ! మొరటు పన్లు చేసి- ఈ నాటు వైద్యంతో ప్రాణం మీదకి తెచ్చుకుంటారు." విసుక్కుంది సోనీ.

వెంటనే ఆపరేషన్‌కు సిద్ధం చేయించింది.

క్షణాలు- నిముషాలు యుగాల్లా గడిచిన తర్వాత-

"కంగ్రాట్స్! ప్రభువు దయ వలన మగబిడ్డ పుట్టింది." సోనీ చెప్పింది ప్రతాప్‌ను అభినందిస్తూ.

"ఇంతకూ కోడలు పిల్ల,-" రాయుడు ఆదుర్దాగా అడిగాడు.

"ఇద్దరూ క్షేమం..."

రాయుడు చేతులెత్తి దండం పెట్టాడు.

ప్రతాప్ ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు.

సోనీ తన రూమ్ కొచ్చింది.

ఏడుస్తూ పుట్టే జీవి..ఏడుస్తూ పోతుంది.

పూర్వజన్మ స్మృతులు గుర్తుకొచ్చి జీవి ఏడుస్తూందంటారు. ఎంతవరకు నిజమో? అసలు పునర్జన్మ ఉందా? హిందువులు తెగనమ్ముతారు. కర్మ పరిపక్వం కాకపోతే జీవి పుడుతుందిట!

ఆయా వచ్చి ఇంకో పేషంట్ పరిస్థితి బాగులేదని చెబితే సోనీ వెళ్లింది.

ఇంటికి చేరేసరికి రెండయింది.

వంట మనిషి మరియమ్మ అన్నం వడ్డించింది. తినబుద్ధి కావడంలేదు.

ఒక జీవి ప్రాణం పోసుకుందని ఆనందించాలా? ఒక సంబంధం చెడిపోతున్నదని విచారించాలా?

ఏదో నాలుగు మెతుకులు గతికి లేచింది.

"ఏమ్మా! మనసు బాగోలేదా?" మరియమ్మ అడిగింది.

"ఏమో! తినబుద్ధికావడం లేదు."

బైబిలు ముందు పెట్టుకూర్చుంది.

రాయుడు పాలేరు వచ్చాడు. కావడిలో పూలు, పండ్లు, బట్టలు పట్టుకుని వచ్చాడు. అవన్నీ ఆమె ముందు పెట్టాడు.

"ఏవిటి దంతా?" విసుగ్గా అడిగింది.

"రాయుడుగారు పంపారు. మీ కిమ్మని చెప్పారు." పాలేరు చెప్పాడు.

"పట్టుకుపో- నాకేం అక్కరలేదు."

"రాయుడుగారికి కోపం వస్తుంది. ఇవ్వడం తెలుసుకాని-ఆయనకు పుచ్చుకోవడం తెలీదు." పాలేరు అన్నాడు.

"దేని కివన్నీ?"

"అదేంటి- పురుడు పోశారుగా పండంటి మగబిడ్డ పుట్టాడు. రాయుడుగారు తాతయ్యారు. ఆ సంతోషంలో మీకు బహుమానం పంపారు." పాలేరు చెప్పాడు భక్తితో

"ఉండచ్చు కాని ప్రభుత్వం నాకు జీతం ఇస్తుంది. ఇలా లంచాలు పట్టడం నా కలవాటు లేదు." కోపంగా చెప్పింది.

"ఇది తప్పు-ఇది లంచం కాదు-ఆనందం-బహుమానం! ఈ ఊరికి కొత్తగా వచ్చారు ఆయన సంగతి మీకు తెలీదు.నమ్మి తన పక్కన చేరితే నజరానాలు ఇస్తారు. శత్రుత్వం వస్తే అంతు చూసే దాకా వదలరు."

కొంచెం బెదిరింపు ఉంది. అర్థింపు ఉంది.

"పోన్లే డాక్టరమ్మా... తీసుకో... నీ కిష్టం లేకపోతే మాలాంటి బీదోళ్లకి ఇద్దువుగాని." మరియమ్మ చెప్పింది.

"సరే అక్కడ పెట్టిపో." లోపలికి పోతూ అంది.

"ఇంకో మాట డాక్టరమ్మగోరు- ఈ రాత్రికి రాయుడుగారి మూడో కుమారుడి పెండ్లి ఉంది.మర్చిపోకుండా తమర్ని రమ్మనమని చెప్పారు." పాలేరు వెళ్లిపోతూ అన్నాడు.

వారం క్రిందట శుభలేఖ గుర్తు కొచ్చింది.

చాలా బాగుంది. బంగారు రంగు అంచు, ప్రాణిగ్రహణానికి గుర్తుగా చేతిలో చెయ్యి. అపూర్వంగా దాన్ని దాచుకుంది.

ఎప్పుడు తన పెళ్లి కుదురుతుందో?

మోసెస్! చాలా ఆదర్శ భావాలు ఉన్నట్టు తనతో పరిచయం పెంచుకున్నాడు. తీరా పెళ్లి మాట ఎత్తగానే తన తల్లిదండ్రుల మాట కాదనలేనంటాడు. లక్ష రూపాయల మూట కావాలి?

సామాన్య తరగతి కుటుంబం!

కొద్దో గొప్పో తన్ను మెడిసిన్ చదివించేసరికి ఖర్చయిపోయింది.

తన స్నేహితులు ఈ కట్నం రక్కసి కోరల నుంచి తప్పించుకోవడానికి ప్రేమ పెళ్లిళ్లు చేసుకున్నారు. కాని తనకా ఇది లేదు.

కాస్త కునుకు పట్టిందో లేదో మళ్లీ కబురు.

హడావిడిగా హస్పిటల్‌కు వెళ్లింది.

ఆమె స్పృహలో లేదు. ఆమె తాలుకు మనుషులు ఏడుస్తున్నారు.

అక్బర్ అప్పటికే కొంత వైద్యం చేశాడు.

'మానభంగం కేసు"

గుండె జల్లు మంది!

మనిషి మృగంలోంచి పుట్టాడన్న పరిణామవాదానికి ఓ చిన్న రుజువు ఈ కేసు.

చాలా చోట్ల గాయాలయ్యాయి.

బాగా ఎదురుతిరిగినట్టుంది. మనిషి దిట్టంగా - అందంగా - బింకంగా - పొంకంగా ఉంది. ఎవడో పశువులాంటివాడు ఆమెను చెరిచి ఉండాలి.

"డాక్టరమ్మా! ఈ విషయం ఎవరికీ చెప్పమాకు." పెద్దామె అంది. "పెళ్లి కావాల్సిన పిల్ల. దాని జీవితం నేలరాశాడు."

"ఎవరు చేశారు?"

"వాడి జిమ్మడ. వాడు దొంగ పీనుగః రంగ అని ఉన్నడు. వాడి కన్ను దీని మీద ఎప్పటినుంచో పడింది. దీని పెళ్లి వేరే వాళ్లతో ఖాయమయ్యేసరికి చూడలేక... పొలంలో ఒంటరిగా దొరికితే దరిద్రపు గొట్టు వెధవ!" ఏడుపు ఆవేశం కట్టలు తెంచుకున్నాయి.

ఆమెకు కొంచెం స్పృహ వచ్చింది. "నీ పేరేమిటి?' సోనీ అడిగింది చెయ్యి చూస్తూ.

"వదులు - నన్నొదులు - నా దగ్గరికి వస్తే చంపేస్తా... వదులు ఛీ!" తెగ ఆవేశపడిపోయింది.

ఫిట్సులాగా వచ్చింది. ఆ దృశ్యం ఆమెకు కన్పిస్తున్నట్లుంది. ఎంతకూ కంట్రోల్ కాకపోతే కాంపోజ్ ఇచ్చింది.

"ముత్యాలుకు ఇంకో వారంలో పెళ్లి ఉందమ్మా! దీని బతుకు ఇలా కాలిపోయింది."

"రంగ దొరికాడా?"

"ఇంకెక్కడి రంగ - వాడూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఏట్లో దూకి, ముత్యాలు లేని బతుకు నా కొద్దని చచ్చాడు."

"ఓ! ప్రేమ విఫలమై చేసిన ఘాతుకమా ఇది?"

"ప్రేమా వాడి బొందా! వాడికి పెళ్లయి పెళ్లాం లేచిపోయింది. అమ్మా! ఈమె విషయం నీ కడుపున పెట్టుకోమ్మా! పోలీసు కంప్లెయింటు ఇవ్వవద్దమ్మా!" చేతులు పట్టుకుంది.

"కాని తప్పదు. నా వృత్తి ధర్మం పాటించాలిగా?" సోనీ అంది.

"అమ్మా! పోలీసు లొచ్చి ఏంచేస్తారు? అడ్డమైన ప్రశ్నలు అడుగుతారు. ఈ వార్తకు ప్రాముఖ్యం ఇస్తారు. ఆ నోటా ఈ నోటా ఊళ్లన్నీ తెలిసిపోతాయి. చివరికి నా బిడ్డను కూడా ఆత్మహత్యే గతి అవుతుంది. కాస్త ఆలోచించమ్మా! కావాలంటే ఈ డబ్బు ఉంచు." కొన్ని నోట్లు తీసింది. "షటప్! అవి లోపల పెట్టు." సోని కోపంగా బయటకు నడిచింది.

మనసంతా వికలమైపోయింది.

ఏమిటో ఈ జీవితం! ఎక్కడకో ఈ పయనం? పుట్టడం ఏమిటి? పెరగడం ఏమిటి? పెళ్లి ఏమిటి? పిల్లలు ఏమిటి? అంతా మిధ్య?

జీవితం నడుస్తున్న సినిమా అంతే!

పిల్లల్ని కని, పెంచి, ఆశలు  పెట్టుకుంటే చివరికి ఏమవుతుందో ఎవరికీ తెలీదు.

మెడికో లీగల్ కేసు. తెలపాలా, వద్దా? మానవత్వం! వృత్తి ధర్మం! సంఘర్షణ! దేన్ని పాటించాలి.

పోలీసులు కేసు పెడితే ఆమెకు పెళ్లి కాదు.

ఏదైతే అదైయింది. తెలియపరచకూడదనుకుంది.

సాయంత్రం ఆరుగంటలకు మళ్లీ కబురొచ్చింది.

నలుగురు ఆసుపత్రిలో చేరారు. ఘర్షణలు, మతం ముసుగులో దొమ్మీ.

ఆఘ మేఘాల మీద సపర్యలు -

పక్క గ్రామంలో చిన్న కొట్లాట. దానికి కారణం మతం - మూఢత్వం!

మూర్ఖులు. దేవుడొక్కడే అని తెలీదా?

మా దేవుడు గొప్ప అంటే మా దేవుడు గొప్ప అని, మా మతం మిన్న అంటే మా మతం మిన్న అని కన్నుమిన్ను కానరాకుండా మస్తుగా తాగి కొట్టుకు ఛస్తున్నారు.

ప్రపంచ చరిత్రలో కరుణమయుడైన దేవుడి కోసం జరిగినంత రక్తపాతం ఇంకే విషయంలోనూ జరిగి ఉండదు.

జీసస్! ఈ మనుషులకు ఎప్పుడు బుద్ధి వస్తుంది?

అమ్మని ఏ బాషలో పిలిచినా ఆ మాతృత్వపు మాధుర్యం మరుగున పడుతుందా?

ప్రభువును ఏ పేరుతో కొలిచినా కరుణించడా?

ఆలోచనల్తో తల పట్టుకుని కూర్చున్న సోనీ ఎదురుగా ఉన్న భారీ ఆకారాన్ని చూసి తల ఎత్తింది.

"రాయుడుగారా రండి, కూర్చోండి."

"కూర్చోవడానికి రాలేదు డాక్టరమ్మా. నీకు విషయం చెబుదామని వచ్చాను. ఇందాక దెబ్బలు తగిలి చేరిన వాళ్లల్లో బెడ్ నెంబర్ మూడు మీద పడుకున్నాడే వాడు ఎటువంటి పరిస్థితుల్లోనూ బతకకూడదు! ఏం చేస్తావో నీ ఇష్టం!" కటువుగా అన్నాడు.

"సారీ! ఈ వృత్తినే స్వీకరించింది మానవుల ప్రాణం కాపాడటానికి... కాని తియ్యడానికి కాదు."

" సోనీ! ఇది చర్చి కాదు. బోధలు చేయడానికి. వీడు రాయుడు. రెండే మాటలు. ఊరికే చెయ్యొద్దు. ఇదిగో డబ్బు లక్ష! ఈ బ్రీఫ్‌కేసులో ఉంది చూడు. ఇక్కడ పెట్టిపోతున్నాను. తీసుకొని నే చెప్పినట్లు చేస్తావో, లేదా నువ్వే చస్తావో ఆలోచించుకో."

మీసాలు మెలేసి వెళ్లిపోయాడు.

ఆ రౌద్రాకారం తలచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తున్నది.

పొద్దున రెండు చేతులెత్తి నమస్కరించిన రాయుడేనా. ఈ రాయుడు. ప్రాణం తియ్యమని లేకపోతే తీస్తానని బెదిరించింది అతడేనా?

అంతా కలగా ఉంది.

కలకాదు పచ్చి నిజం అన్నట్టు ఎదురుగా బ్రీఫ్‌కేసుంది.

లక్ష రూపాయలు!

లక్ష! లక్ష! లక్ష!

ఆఁ! తన్ను తన జీవితంలోకి ఆహ్వానించడానికి మోసెస్ అడిగిన లంచం కూడా లక్షే!

వణుకుతున్న చేతుల్తో బ్రీఫ్ కేసు అందుకుని బీరువాలో పెట్టి తాళం వేసి తాళం హేండ్‌బ్యాగ్‌లో వేసుకుంది.

మోసెస్ అందగాడు. ఆస్తిపరుడు. మంచి బిజినెస్ చేస్తున్నాడు.

అవును తన జీవితంతో కూడా బిజినెస్ చేస్తున్నాడు. లక్ష రూపాయల బిజినెస్!

అతని అవసరాలు చూస్తూ, అతనికి జీతం లేకుండా జీవితమంతా చాకిరీ చేసేందుకు అతనడుగుతున్న లంచం లక్ష! ఊడిగం చెయ్యాలి, డబ్బూ ఇవ్వాలి। ఈ భారతీయ సాంప్రదాయం ఎప్పుడు మారుతుందో?

ఎప్పుడు స్త్రీ, పురుషులు స్వేచ్ఛగా-షరతులు లేకుండా ప్రణయమాడతారో? హే జీసస్! ఆ రోజు నేను చూస్తానా? ఏం కరుణామయుడువయ్యా? లోకంలో ఇంత అవినీతిని, ఇంత పాపాన్ని పండిస్తున్నావు.

నువ్వు నిజమైన గొర్రెల కాపరి కాదు.

"అమ్మగారూ! రాయుడుగారి అబ్బాయి పెళ్లికి టైం అవుతున్నది. పోయి వద్దాం పదండి." మరియమ్మ చెప్పింది.

"ఏం పోవాలో! నాకేం చుట్టమా పక్కమా?"

"ఏం చుట్టరికం లేకపోయినా-ఈ ఊరికి పెద్ద కామందు ఆయనే నమ్మా? ఆయన్ని ఎదిరించి ఈ ఊళ్లో ఎవరూ ఉండలేరు. మనం పెళ్లికి వెళ్లలేదని తర్వాత ఆయనకు తెలిసినా సాధిస్తారు-పదండి."

"ఇదెక్కడి పల్లెరో బాబూ! నా ప్రాణానికి వచ్చిపడింది. నా మానాన నన్ను బ్రతకనివ్వరా?"విసుక్కుంది.

"డాక్టరమ్మా! చదువుకోగానే సరికాదు - ఊళ్లో బతకాలంటే లౌక్యం ఉండాలి. పదండి - అలా షికారుగా పోయి వద్దాం." మరియమ్మ ప్రాధేయపడింది.

సోనీకి కూడా ఉత్సాహం ముంచుకొచ్చింది. పెండ్లి అంటేనే అదొక థ్రిల్లు! అందులో హిందూ వివాహం గొప్పగా చేస్తారు. భూకామందు. ఇంకెంత బాగా చేస్తున్నారో చూసి రావాలి.

పెళ్లి వైభవంగా జరిగింది.

ఊరు ఊరంతా తరలి వచ్చింది.

సన్నాయి మోత - కోలాహలం - హడావిడి - అంతా అబ్బురంగా తోచాయి సోనీకి.

పెళ్లి భోజనంలో వడ్డించిన పదార్థాలు చూసి ఆశ్చర్యపోయింది. రెండు స్వీట్లు - రెండు హాట్లు - రెండు కూరలు - రెండు పచ్చళ్లు ఇంకా ఎన్నో!

కడుపు నిండిపోయింది. తినాల్సినవి ఇంకా ఉన్నాయి.

ఒక వంక తిండిలేక దేశంలో అలో లక్ష్మణా అంటూ ఏడుస్తూ ఉంటే - తిండెక్కువై పారేస్తున్నాం అన్న గిల్టీకాన్షస్ ఆమెకు కలిగింది.

ఎక్కువ సేపు ఆమెని ఇబ్బంది పెట్టకుండా - ఆసుపత్రి నుంచి కబురు వచ్చింది ఇద్దరికి సీరియస్‌గా ఉందని. సుశిక్షిత సైనికుడిలాగా హుటాహుటిగా ఆసుపత్రికి చేరుకుంది. అక్తర్ లేడు. పెళ్లికి వెళ్లినట్టున్నాడు. నర్స్ కూడా లేదు.

బెడ్ నంబర్ మూడు ఎగశ్వాస పీలుస్తున్నాడు.

రెండో బెడ్ పైన కూడా అతని పరిస్థితి అలాగే ఉంది.

వెంటనే ఆక్సిజన్ సిలిండర్ అమర్చింది.

మంచి మందుల కోసం చూసింది కాని దొరకలేదు. ఇంక వేరేవి ఇవ్వాల్సి వచ్చింది.

పేషెంట్ తాలూకు మనుషులకు మందులు రాసిచ్చింది... కాని అవి దొరకలేదు.

రెండు గంటల తర్వాత అక్తర్ వచ్చాడు. ఊరికే రాలేదు. వెంట పేషెంట్ వచ్చాడు.

సర్దార్జీ స్పృహ లేకుండా ఉన్నాడు. ఒళ్లంతా రక్తం మరకలు, తల మీద బలమైన గాయం తగిలింది.

"ఏమైంది?" కంగారుగా అడిగింది.

"పెళ్లిలో చిన్న గలాటా అయింది. కొంతమంది బాగా తాగేసీ మా పార్టీ గొప్పంటే మా పార్టీ గొప్పని కుమ్ములాడుకున్నారు. పాపం.. అమాయకంగా అడ్డుపోయాడు. వాళ్లు బాగున్నారు. ఇతనికి దెబ్బలు తగిలాయి."

మళ్లీ యుద్ధప్రాతిపదిక మీద సర్దార్జీని రక్షించే ఏర్పాట్లు మొదలయ్యాయి.

ఆపరేషన్ థియేటర్‌లో మైనర్ ఆపరేషన్లు చేసి కట్లు కట్టారు.

ఇంజెక్షన్లు ఇచ్చారు. సెలైన్ ఎక్కించారు. అంతా అయ్యేసరికి తెల్లారుజామున నాలుగయింది.

"అక్తర్! లాభం లేదు. బ్లడ్ కావాలి."

"స్టాక్ లేదుకదా డాక్టర్!"

"ఏ గ్రూపు?"

"ఓ గ్రూపు?"

"ఓ గ్రూపా? నాదీ అదే. సరే నే యిస్తా ఓ బాటిల్. అరేంజ్ చెయ్యి."

అక్తర్ కొయ్యబారిపోయాడు. ఎవరో ముక్కూ,మొహం తెలీని పేషంట్‌కు డాక్టరమ్మ తన నెత్తురు ఇస్తుందా?

"వద్దమ్మా, అసలే బలహీనంగా ఉన్నారు. నేనిస్తాలెండి. నాదీ ఓ గ్రూపే!"

"సరే కాని, ముందు నువ్వు ఇవ్వు. చాలకపోతే నే ఇస్తాను." సోనీ అతని బ్లడ్ తీసి సర్దార్జీకి అమర్చింది.

బెడ్ నంబర్ మూడు చివరి శ్వాస పీల్చాడు.

అక్తర్ దుప్పటి కప్పేశాడు.

'జీసస్! ఏమిటయ్యా ఇది. ఓ ప్రాణిని తీసుకుపోయావా?'

అతని తాలూకు వ్యక్తులు ఘొల్లున ఏడుస్తున్నారు.

ఆ ఏడుపులు గుండెలు బద్దలు కొడుతున్నాయి.

ఏ భాషలో ఏడ్చినా ఏడ్పు ఒకటే - నవ్వూ ఒకటే!

కలహాలకు ముందు దాని పరిణామం ఎలా ఉంటుందో ఒక్కమారు ఊహిస్తే ఎవరూ ముందుకు దిగరు.

సోనీకి షాక్ తగిలింది. ఆమె చేతుల మీదుగా ఎక్కువ మంది పోలేదు.

పోయేముందు అతను కన్ను తెరిచి సోనీని చూసిన చూపు బాకులా ఆమె హృదయంలో దిగింది.

"నిజం చెప్పు. నన్ను రక్షించడానికి నువ్వు సిన్సియర్‌గా ప్రయత్నించావా?" అన్నట్లు ఉంది ఆ చూపు.

గదిలోకొచ్చి బైబిలు మీద వాలిపోయింది.

అక్బర్ వచ్చి లేపాడు- తను కూడా బ్లడ్ ఇవ్వాలని. సంతోషంగా ఓ బాటిల్ బ్లడ్ ఇచ్చింది సోనీ. ఆ బ్లడ్ సర్దార్జీ వెయిన్‌గుండా లోపలికి వెళుతూంటే తృప్తిగా చూసుకుంది.

తన నీరసం, అలసట అన్నీ ఆ తృప్తిలో కలిసిపోయాయి. సోనీ తృప్తిగా తన గదికొచ్చింది.

"థాంక్స్! డాక్టరమ్మా?"

ఎదురుగా రాయుడు.

"ఎందుకు?"

"ముందు సర్దార్జీని బతికిస్తున్నందుకు. తర్వాత అతన్ని పైకి పంపినందుకు."

"నో! నో!"

"థాంక్స్! వస్తా"

"ఆగండి. అతను చనిపోవడంలో నా ప్రమేయం లేదు. మీ డబ్బు మీరు తీసుకుపోండి."

"తప్పమ్మా! అతన్ని బతికించవద్దని చెప్పి డబ్బు ఇచ్చాను. అతను బతకలేదు. డబ్బు నీదే. మాట తప్పను."

"కాని.. అతన్ని చంపింది జీసస్! ఈ డబ్బు తీసుకుపోయి ఆయనకే ఇవ్వండి చేతనైతే!"

బ్రీఫ్‌కేస్ విసిరేసింది. మొహం దాచుకుంది ఏడుస్తూ. అతను చనిపోతూ చూసిన చూపే పదే పదే గుర్తు కొస్తున్నది.

రాయుడు ఆమె వంక విచిత్రంగా చూసి బ్రీఫ్‌కేస్ తీసుకుని బయటకు వెళ్ళాడు.

ఓ గంట తర్వాత బయటకొచ్చిన సోనీకి రాయుడు కనిపించాడు.

"ఏం? ఇంకా ఎందుకు ఇక్కడున్నారు? ఇంకా ఎవరి ప్రాణం తియ్యాలి?" రౌద్రంగా అరిచింది సోనీ.

"డాక్టర్! ఆయన ఎవరనుకున్నారు. రాయుడుగారు."

"నాకు మటుకు కేవలం ఓ మనిషి. ఖూనీలు-దొంగతనాలు చేయించే కిరాతకుడు." సోనీ విసురుగా అంది.

"అక్బర్! ఈ మాటలంది నాకు మనవడ్ని ప్రసాదించిన డాక్టరమ్మ కాకపోతే ముక్కలు చెక్కలుగా నరికి పోగు లెట్టేవాడ్ని! ఇంక నా పనైంది వస్తా." రాయుడు గంభీరంగా వెళ్లిపోయాడు.

"అక్బర్! ఎందుకు అతన్ని ఇంతసేపుంచావు?"

"డాక్టర్‌గారు ఆయన తన నెత్తురు దానం చేసి వెళ్లాడు. సర్దార్జీ కోసం, అతను ఆయన కేమీ కాడు. కేవలం పెళ్లి కొచ్చిన అతిథి!"

"వాట్! అతను నెత్తురు ఇచ్చాడా?"

"ఆఁ! పెట్టబోతున్న బాటిల్ అతనిదే." ఆన్ చేస్తూ అన్నాడు అక్బర్!

సోనీకి అది ఊహకు కూడా అందని విషయం. కాని తను అక్బర్‌ను శంకించలేదు. అతను సేవకు అంకితమయినవాడు. ఎమర్జెన్సీ వస్తే ఏ టైంలో అయినా పలికేవాడు. తన లాగే అతనికి డ్యూటీ అవర్స్ అంటూ లేవు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు రావడమే!

అతను చెబుతూంటే నమ్మాల్సిందే!"ఆగు! ఆ నెత్తురు ఎక్కించవద్దు. అది విషపూరితం. పాపం. మానవత్వంతో ఉన్న సర్దార్జీ కూడా పాములాగా తయారవుతాడు ఆ నెత్తురు తీసుకుని."

"తీసుకోనియండమ్మా! తీసుకోనీయండి. సర్దార్జీలో మూడు మతాల నెత్తురు ప్రవహిస్తున్నది ఇప్పుడు. హిందూ, ముస్లిం, క్రిష్టియన్ల రక్తం. అది బయటికొచ్చినప్పుడు ఏ రక్తం ఎవరిదో ఎవరైనా తెలుసుకోగలరా? రాయుడు కూడా కృతజ్ఞతతో ఇచ్చాడు తన నెత్తురు. ఈ గ్రామ చరిత్రలో ఇది అపూర్వం. ఇదంతా అల్లా దయ." అక్బర్ అన్నాడు.

"వదులు - నన్నొదులు - ఛీ దూరంగా పో... చంపేస్తా?" అరుపులు వినిపిస్తే ఆ గదివైపు చూసింది.

ముత్యాలుకు మెలకువ వచ్చినట్టుంది అరుస్తున్నది.

బెడ్ నంబర్ రెండు నాలుగు బాధతో మూలుగుతున్నారు. ఇద్దరూ భిన్న మతస్థులే ఒకళ్ల మీద కొకళ్లు కత్తులు నూరుకున్న వాళ్లే! కాని హాస్పిటల్‌లో ఒకరి పక్కన ఒకరు పడుకుని పట్టించుకునే నాథుడు లేక మూలుగుతున్నారు. ఇద్దరి మూలుగు ఒక్కలాగే ఉంది. అది బాధల్లోంచి పుట్టింది. ఎవరి కోసమైతే కొట్లాడారో వాళ్లెవరూ అక్కడ లేరు.

నర్స్ సునంద చకచకా తన డ్యూటీ చేసుకుపోతున్నది. ఓ చిన్న హాస్పిటల్‌లో మూడు భిన్న మతాల వాళ్లు కలిసి భిన్న మతస్థుల్ని బతికిస్తున్నారు.

బయట చనిపోయిన తాలూకు అతని బంధువులు కావును ఇంకా ఏడుస్తూనే ఉన్నారు.

సోనీ నిద్ర కళ్లతో ఇంటికి వచ్చింది.

ఫ్రెష్ అయి కాఫీ తాగుతున్న ఆమెకు జీవితం అంటే ఏంటో అర్థం కావడంలేదు. ఈ ఇరవై నాలుగు గంటల్లో జరిగిన సంఘటనలు ఆమె మెదడును అల్లకల్లోలం చేస్తున్నాయి.

పుట్టుక, చావు సహజం! కాని ఈ రెండింటి మధ్య పెరిగిన ఆ మనిషి ఎంత ఆర్భాటం చేస్తాడు? ఎన్నో పొట్టలు కొట్టి తన జానెడు పొట్ట నింపుకోవడానికి చూస్తాడు. ఎందర్నో కొట్టి తన ప్రాణం నిలుపుకోవడానికి చూస్తాడు.

కాని చివరికి భూదేవి చల్లని ఒడిలో శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటాడు. ఈ కాస్త దానికి ఈ కుల వ్యామోహాలు, ఈ మత కార్పణ్యాలు - ఆస్తి, అంతస్తు మోతలు, ఈర్ష్యలు, అసూయలు ఎందుకు? మనిషి ఎంత ఎత్తు ఎదిగినా విధి ముందు నలుసే? ఎప్పటికీ అతను అలుసే?

కాగితం అందుకొని సోనీ పీటర్‌కు ఉత్తరం రాస్తున్నది.

"నాన్నా! లక్ష ఇచ్చి మోసెస్‌ను కొనుక్కోవడం నా కిష్టం లేదు. నాకు కావలసింది నే బతికినంత కాలం నాకు తోడుగా నిలిచేవాడు. అందుకు ఖరీదైన బిజినెస్ మ్యానే అక్కరలేదు. కాస్త మనసున్న మనిషి అయితే చాలు? నాకు కావలసిన హబ్బీకి అన్నిటికంటే ముఖ్యంగా మానవత్వం ఉంటే చాలు. అటువంటి సంబంధం నీకు కనిపిస్తే నయాపైసా కట్నం ఇవ్వకుండా నా పెళ్లి చేయి. ఆలస్యం అయినా ఫర్వాలేదు. ఆ ఘడియ కోసం ఎదురుచూస్తూ ఉంటాను.

**నీ సోనీ"**



(ఆంధ్రప్రభ - ఆగస్టు 3-9-94)